సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 2 | డిసెంబర్ | 2023



మానుకోటలో చోరీ

మానుకోట జిల్లా కేంద్రంలోని పులి గోపాల్‌రెడ్డినగర్ ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు రెండిళ్లలో చోరీచేసి 3తులాల బంగారు ఆభరణాలు, రూ.1.45లక్షల నగదు ఎత్తుకెళ్లారు. - 8లో▸



నిర్లక్ష్యపు డ్రైవింగ్.. మహిళ మృతి

ఓ ఎక్సైజ్ అధికారి కుమారుడు నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా నిండు ప్రాణం బలైంది. రోడ్డు పక్కన నిల్చున్న మహిళను కారుతో ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముగిసిన బుగులోని జాతర



రేగొండ: రేగొండ మండలం తిరుమలగిరి శివారులో జరుగుతున్న శ్రీ బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర శుక్రవారం ముగిసింది. చివరి రోజు కూడా భక్తులతో జాతర పరిసరాలు కోలాహలంగా మారాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేంకటేశ్వర స్వామికి మొక్కులు సమర్పించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గుట్టపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గుట్టకిందకు తీసుకువచ్చి అర్చకులు కుర్మాచలం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక రథంలో అర్చకులు కుర్మాచలం వెంకటేశ్వర్లు ఇంటికి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆరు రోజుల పాటు జరిగిన బుగులోని జాతర బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషిచేసిన అన్ని శాఖల అధికారులకు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ పరీక్ష ఫీజుకు గడువు

కేయూ క్యాంపస్: కేయూ డిగ్రీ కోర్సులకు మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలకు పరీక్ష ఫీజులు చెల్లించే గడువు అపరాధ రుసుము లేకుండా ఈనెల 4 వరకు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 8 వరకు గడువు ఉందని వారు తెలిపారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో 23వ మండల పూజలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం స్వామికి భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు. బండారుపల్లి చందర్‌రావు-కల్యాణి, మోదుగుల శేషగిరిరావు-శేషాద్రి అమ్మ, నరేష్-భవ్య, తక్కళ్లపల్లి సత్యనారాయణ-జయలక్ష్మి, తుమ్మ రమేష్-రజిత, సాయికిరణ్, బ్రాహ్మణపల్లి సుధాకర్-రమాదేవి, సుపాల్‌సునీత, మల్యాల రాజు-శ్రీలత, మల్యాల ప్రవీణ్‌కుమార్, సాగరిక, యశ్వంత్, పడిగల రమేష్-వాణి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, మాదారపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, వంగేటి గోవర్ధన్, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, పాలకుర్తి శ్రీనివాస్, భూపతి లక్ష్మీనారాయణ, మిడిదొడ్డి బాబురావు, శింగిరికొండ రాంరాజ్, శింగిరికొండ వేణుగోపాల్, చిలువేరు వెంకటరాజ్యం, సత్తెమ్మ, దొడ్డ వేణు, శ్రీరాంకిరణ్, గంధం నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ శ్రీ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేడుకను తిలకించి పులకించిపోయారు. ఆలయ ప్రాంగణం రామ నామ స్మరణతో మార్మోగింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఏసీ మహేందర్‌కుమార్ మధ్యాహ్నం పన్నెండు గంటలకు తలంబ్రాలు, పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి కల్యాణ మండపానికి వేదమంత్రోచ్ఛరణలు, డోలువాయిద్యాల మధ్య భక్తులంతా పల్లకీలో మోసుకొచ్చారు. వేదపండితులు విజయసారథి, గట్టు శ్రీనివాసాచార్యులు, గట్టు రంగాచార్యులు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. 46 మంది పుణ్యదంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. జిలకరబెల్లం, మంగళసూత్రధారణ తదితర వివాహ తంతును మధ్యాహ్నం రెండు గంటలకు ముగించారు. వేదపండితులు భార్గవాచా ర్యులు, మురళీకృష్ణమాచార్యులు, రాఘవరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కిరణ్‌కుమార్, స్థానిక సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

ఫైనల్‌గా 82.02శాతం

- భూపాలపల్లి ఓటర్లలో వెల్లివిరిసిన చైతన్యం
- గత మూడు ఎన్నికలతో పోలిస్తే ఇదే ఎక్కువ..
- ఫలించిన అభ్యర్థుల ప్రచారం, అధికారుల అవగాహన కార్యక్రమాలు



టేకుమట్ల మండలకేంద్రంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి నియోజకవర్గం ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఓటింగ్ శాతం పెరిగింది. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన కొన్ని నియోజకవర్గాలకు సాధ్యం కాని ఓటింగ్ శాతం భూపాలపల్లి నియోజకవర్గంలో నమోదైంది. భూపాలపల్లి నియోజకవర్గంలో 82.02 శాతం ఓటింగ్ నమోదైంది. 2009, 2014, 2018 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌తో పోలిస్తే ఈసారి ఎక్కువగా నమోదైంది. ప్రజలకు అవగాహన, భద్రత కల్పించడంతో ఓటు వేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపారు. ప్రధానంగా యువత, కొత్త ఓటర్లు ఓటేసేందుకు ఉత్సాహం చూపించారు.

82 శాతం దాటిన ఓటింగ్

విద్యాపరంగా, వాణిజ్యపరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నియోజకవర్గాలకు సాధ్యం కాని ఓటింగ్ శాతం భూపాలపల్లిలో నమోదైంది. 2009, 2014, 2018 ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతంతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగింది. 2009 లో 72.22, 2014లో 79.78, 2018లో 81.20శాతం నమోదైంది. ఈసారి ఎన్నికల్లో కొత్త ఓటర్ల సంఖ్య పెరగడం కూడా పోలింగ్ శాతం పెరుగుదలకు కారణంగా చెప్పవచ్చు. యువత ఎన్నికలపై ఎక్కువ ఆసక్తి చూపించి ఓటింగ్‌లో పాల్గొంది. ఎన్నికల సమయానికి రైతుల వ్యవసాయ పనులు దగ్గర పడటం కూడా కారణంగా చెప్పవచ్చు

నెలన్నర రోజులుగా ప్రచారం..

నెలన్నర రోజులుగా అభ్యర్థులు ప్రచారంలో మునిగారు. దీంతో ప్రతీరోజూ ప్రజల, ఓటర్ల దృష్టిని ఆకర్షించి పోలింగ్ శాతం పెరిగేందుకు దోహదపడ్డారు. రాజకీయ పార్టీల నేతలు ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచే ప్రజాక్షేత్రంలో ఉన్నారు. అక్టోబర్ 6న అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పటి నుంచి ప్రచార తీవ్రత మరింత పెరిగింది. దీనికి తోడుగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుగానే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారం ఉధృతి క్రమేపీ పెరిగింది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు టికెట్ ప్రకటించకముందు నుంచి ప్రచారం మొదలు పెట్టారు. దీంతో వార్తల్లో ప్రతీరోజూ నాయకులు ఉండటంతో ప్రజల్లో కూడా ఈ ఎన్నికల పట్ల ఆసక్తి పెరిగింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి అభ్యర్థులు ప్రచారానికి ఎక్కువగా ఖర్చు చేసినట్లు సమాచారం. గ్రామాల్లో అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారంటే ఒక రకమైన పండగ వాతావరణం ఏర్పడింది. డప్పు చప్పుళ్లు, కోలాటాలు ప్రజల దృష్టిని ఆకర్షించడంలో ప్రధానపాత్ర వహించాయి.

ఓటింగ్ శాతం పెరిగేందుకు అవగాహన సదస్సులు

పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తెలంగాణ సాంస్కృతికసారథి, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎన్నికలు, ఓటు హక్కు గురించి ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి తగినంత సమయం దొరికింది. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో కూడా అధికారులు ఎన్నికలపై అవగాహన కల్పించడంలో విజయవంతం అయ్యారు. ఎన్నికలు, ఓటు హక్కు విశిష్టత ప్రతీ పల్లెకు చేరేవిధంగా అధికారులు కృషిచేశారు. దీంతో తప్పకుండా ఎన్నికల్లో పాల్గొనాలనే ఆలోచన వచ్చింది. అధికారులు చూపిన చొరవ పోలింగ్ శాతం పెరిగేందుకు దోహదపడింది.

ఎవరెవరు ఎంత..	
మొత్తం ఓట్లు	2,73,633
పోలైన ఓట్లు	2,24,432
పురుషులు	1,11,739
మహిళలు	1,12,690
థర్డ్‌జెండర్	ముగ్గురు

భూపాలపల్లి నియోజకవర్గంలో పోలింగ్ శాతం..

2009	2014	2018	2023
72.22	79.78	81.20	82.02

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

చుట్టూ మావోయిస్టుల కంచుకోటలు. తెలంగాణ ఎన్నికల ముందే ఛత్తీస్‌గఢ్ ఎన్నికలు పూర్తి కావడంతో మావోయిస్టుల చూపు ఇటు వైపు పడింది. కానీ జిల్లా పోలీస్ యంత్రాంగం ఒక్కచిన్న ఘటన కూడా జరగకుండా ఎన్నికలను ప్రశాంతంగా పూర్తిచేసింది. జిల్లాలో మావోయిస్టుల కార్యకలాపాలు పెరగకుండా చూడటంలో జిల్లా పోలీస్ యంత్రాంగం సక్సెస్ అయింది. ఏజెన్సీ ప్రాంతాలతో పాటు అన్ని ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేయడంతో ప్రజలు నిర్భయంగా వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మంథని, భూపాలపల్లి, ములుగు, భద్రాచలంలో మావోయిస్టుల కార్యకలాపాలు ఎక్కువగా ఉండటంతో పోలింగ్‌ను నాలుగు గంటల వరకే పరిమితం చేశారు. ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర వంటి నక్సల్స్ కంచుకోటలు పక్కనే ఉండటంతో పోలీస్ అధికారులు రెప్పపాటు నిర్లక్ష్యానికి తావివ్వకుండా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. మావోయిస్టు యాక్షన్‌టీంలు జిల్లాలో సంచరిస్తున్నా నిఘా, సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎటువంటి ఘటనలు జరగనివ్వకుండా చేశారు.

భూపాలపల్లి మున్సిపాలిటీలో తగ్గిన ఓటింగ్

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓటింగ్ శాతం అతి తక్కువగా నమోదైంది. నియోజకవర్గంలోని భూపాలపల్లి మండలం పంబాపూర్‌లో 93.64శాతం పోలింగ్ నమోదు కాగా మున్సిపాలిటీ పరిధిలో 48 పోలింగ్ బూత్‌లు ఉండగా కేవలం 55శాతం మాత్రమే పోలింగ్ నమోదైనట్లు తెలిసింది.

యాసంగికి సిద్ధం

- జిల్లాలో 1,13,452ఎకరాల్లో సాగు అంచనా
- 26,092 మెట్రిక్ టన్నుల ఎరువులు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు



భూపాలపల్లి రూరల్: జిల్లాలో యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గతేడాది 1,05,625 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేయగా.. ఈ సారి 1,13,452 ఎకరాల్లో సాగుకు అధికారులు అంచనా వేస్తున్నారు. వరి, మొక్కజొన్న పంటలకు ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలో గతేడాదిలో వరి 84,268 ఎకరాల్లో సాగుచేయగా.. ఈ సారి 95,400 ఎకరాల్లో సాగుకు అధికారులు అంచనా వేశారు. మొక్కజొన్న గతేడాది 11,029 ఎకరాల్లో సాగుచేయగా ఈ ఏడాది 6,500 ఎకరాల్లో మాత్రమే సాగు చేయనున్నారని అధికారులు అంచనాలు వేశారు. జిల్లాలో ఐదేళ్లుగా చిరుధాన్యాలు, రాగులు, సజ్జలు లాంటివి పండించడం లేదు. వాణిజ్య పంటల మాదిరిగా పప్పుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కంది, పెసర, మినుము పంటలు కూడా పదుల ఎకరాల్లోనే సాగు చేస్తున్నారు. జిల్లాలో 1,13,452 ఎకరాల సాగుకు 24,459 క్వింటాల విత్తనాలు అవసరం కానున్నాయి. ఇప్పటికే రైతుల వద్ద 9,585 క్వింటాలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ దగ్గర 117 క్వింటాలు, డీలర్ల ద్వారా 14,757 క్వింటాల్ అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో కావాల్సిన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

ఎరువు	కావాల్సినవి	అందుబాటులో ఉన్నవి
యూరియా	17,017	8,000
డీఏపీ	3,403	945
కాంప్లెక్స్	3,403	2,240
పొటాష్	2,269	60

ప్రణాళిక సిద్ధం చేశాం..



జిల్లాలో 1,13,452 ఎకరాల్లో యాసంగి పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాం. ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేయాలి.

- విజయ్‌భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వివిధ పంటల సాగు అంచనా (ఎకరాల్లో..)

పంట	అంచనా
వరి	95,400
మొక్కజొన్న	6,500
పెసర	350
మినుములు	75
వేరుశనగ	25
సాంద్రత పత్తి	12
నువ్వులు	90
జనుము	150
శనిగలు	50
ఇతర పంటలు	10,800
మొత్తం	1,13,452

గోశాలలో చండీహోమం



చండీహోమం చేస్తున్న పూజారులు

టేకుమట్ల: విశ్వశాంతి కోరుతూ మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి గోశాలలో సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలత సురేష్ ఆధ్వర్యంలో గోశాలలో చండీహోమం నిర్వహించారు. తాటికొండ చక్రపాణి గణపతి హోమం, చండీహోమం, రుద్రాభిషేకం, ఉసిరి చెట్టు పూజ, తులసి పూజలు అత్యంత వైభవంగా చేశారు. పదకొండు రకాల వంటకాలతో మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 500మంది భక్తులు నాలుగు జిల్లాల నుంచి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గొరిశెట్టి శ్రీనివాస్, అధ్యక్షుడు సరోత్తంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోరువెచ్చని గంగ



1978లో వేసిన బోరు



వేడినీళ్లలో దుస్తులు ఉతుకుతున్న మహిళలు

- 40ఏళ్లుగా ఉప్పొంగుతున్న వేడినీరు
- పలు అవసరాలకు వినియోగిస్తున్న ప్రజలు
- ఆసక్తిగా గమనిస్తున్న నూతన వ్యక్తులు

ఏటూరునాగారం: సాధారణంగా భూమి నుంచి మోటార్ల ద్వారా నీరు బయటకు వస్తే కొంత గోరువెచ్చగా ఉంటుంది. కానీ, ఇక్కడ ఉన్న బోరులో నుంచి ఏడాదిపొడవునా.. వస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. చమురు నిక్షేపాలు ఉన్నాయని 1978లో ములుగు జిల్లా ఏటూరునాగారం రామన్నగూడెంలో తవ్వకాలు జరిపారు. ఈ క్రమంలో వేసిన బోరు నుంచి నిర్విరామంగా వేడినీరు ఉబికి వస్తుంది. ఎలాంటి మోటారు, యంత్రాలు, మిషన్లు లేకుండానే నీరు ఉబికి రావడం ఒక వింత కాగా.. ఆ నీరు వర్షాకాలం, చలికాలం, వేసవి కాలంలో సైతం వెచ్చగా ఉండడం మరో వింతగా కన్పిస్తుంది. రామన్నగూడెంలోని ప్రజలు ఈ వేడినీళ్ల కాల్వలో దుస్తులు ఉతడకం, స్నానాలు చేయడంతోపాటు గృహఅవసరాలకు సైతం ఈ నీటిని వినియోగిస్తుంటారు. అయితే కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చిన వారికి మాత్రం ఈ విషయం ఆశ్చర్యాన్ని కల్గించకమానదు.

విత్తనాలకు ప్రత్యేకత

వరి విత్తనాలు మొలకెత్తేందుకు రైతులు సాధారణంగా గోలెం, డ్రమ్ము లేదా ధాన్యం విత్తనాలపై గోనె సంచులు వేసి నీటితో తడుపుతుంటారు. కానీ రామన్నగూడెంలోని రైతులు వరి విత్తనాల బస్తాలను ఈ వేడినీళ్ల కాల్వలో నానబెట్టి నాటితే వారి నారు ఏపుగా, శక్తివంతంగా పెరుగుతుందని విశ్వసిస్తారు. అందుకోసం విత్తనాలు తెచ్చిన సమయంలో బస్తాలను ఈ నీటిలో వేసి 24 గంటల తర్వాత తీసి మంచంపై ఆరబోసుకుంటారు. ఇలా చేయడం వల్ల దిగుబడి ఎక్కువ వస్తుందని నమ్ముతున్నారు. అంతేకాకుండా మహిళలు, గ్రామస్తులు ఎక్కువగా వారి ఇళ్లలోకి నీటిని తీసుకెళ్లి అవసరాలకు వినియోగించుకుంటారు. ప్రజలు ఆ కాల్వలో నీటిని వినియోగించుకున్న తర్వాత నీరు కాల్వల ద్వారా సమీపంలోని గోదావరి నదిలో కలుస్తుంది. 45 సంవత్సరాలు అవుతున్నప్పటికీ అందులో నీటినిల్వలు కొద్దిగా కూడా తగ్గకపోవడం గమనార్హం. అంతేకాకుండా కొంత మంది రైతులు అందులో మోటార్లను దింపి వరి పంట సాగుకు నీటిని పారించుకుంటున్నారు.

పెట్రోల్ కోసం తవ్వకాలు



రామన్నగూడెం గ్రామపరిధిలో చమురు నిక్షేపాలు ఉన్నాయని, పెట్రోల్ వస్తుందని దివంగత మత్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ తవ్వకాలు చేపట్టారు. అయితే అక్కడ నీరు, చమురు కలిసి ఉన్న ద్రవం బయటకు రావడంతో ఆ తవ్వకాలను నిలిపివేసి హిందుస్థాన్ పెట్రోలిం వారు వెనుదిరిగారు.

- గడ్డం విశ్వనాథం, రామన్నగూడెం

వేడి నీళ్ల కాల్వతో అవసరాలు తీరుతున్నాయి



వేడి నీళ్ల కాల్వ వల్ల స్థానికంగా ఉన్న ప్రజల అవసరాలు తీరుతున్నాయి. ఎప్పుడు చూసిన నీరు వెచ్చగా ఉంటుంది. అందులో స్నానాలు చేయడం, దుస్తులు ఉతకడం చేస్తుంటారు. కానీ నీరు ఎప్పుడు కూడా ఎండిపోకుండా ప్రవహిస్తోంటుంది.

- లక్ష్మి, రామన్నగూడెం

వర్ధన్నపేటలో క్షుద్రపూజల కలకలం



పూజలు చేసిన ఆనవాళ్లను పరిశీలిస్తున్న రైతులు

వర్ధన్నపేట: వర్ధన్నపేటలో క్షుద్రపూజల కలకలం సృష్టించింది. పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రాంతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. పసుపు, కుంకుమ, జీడి గింజలు, కుంకుమతో కలిపిన అన్నం, కొబ్బరికాయ, నిమ్మకాయలు, కోడిగుడ్లు కనిపించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా, ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్



స్ట్రాంగ్ రూంను సీజ్ చేస్తున్న అధికారులు

భూపాలపల్లి అర్బన్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. ఈ నెల 3న ఉదయం 8 గంటలకు జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్ రూం నుంచి కౌంటింగ్‌హాల్‌కు ఈవీఎంల తరలింపు ప్రక్రియ సీసీ కెమెరాలలో రికార్డు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ నిర్వహణలోని ఎన్నికల కమిషన్ నిబంధనల, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల ఫలితాల వెల్లడి సమయంలో పోటీ తీవ్రత ప్రకారం రీకౌంటింగ్ కోరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అప్పుడు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తించుకోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. ప్రతి కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్ల వివరాలు చూపించి, తరువాత అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు అందరికీ స్పష్టంగా తెలిసేలా చూపించాలన్నారు. ఆ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 23 రౌండ్లు ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని, 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 5 ఈవీఎంలను లాటరీ పద్ధతిన ఎంపిక చేసి, వీవీ ప్యాట్ల ఓట్ల లెక్కింపు చేయనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ హాల్‌లో అధికారులు సిబ్బంది మౌనంగా ఉండాలని, ప్రశాంతంగా వ్యవహరించాలని సూచించారు. లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురికావద్దని అన్నారు. ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత ఆ రౌండ్‌లో ప్రతి అభ్యర్థికి వచ్చిన ఓట్ల వివరాలను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పోర్టల్‌లో నమోదుచేసి రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికి కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని అన్నారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సకాలంలో కౌంటింగ్ పూర్తయ్యే విధంగా సిబ్బంది ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్, ప్రతి రౌండ్ కౌంటింగ్ ముగిసిన తర్వాత ఫలితాలు మీడియా సెంటర్ ద్వారా విడుదల చేయాలని, మీడియా సెంటర్‌లో పాత్రికేయులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం ఎస్పీతో కలిసి కలెక్టర్ కౌంటింగ్ కేంద్రం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారి రమాదేవి, డీఎస్పీ రాములు, డీపీఆర్‌ఓ శ్రీధర్, ఎన్నికల నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలు..

స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ భవేష్‌మిశ్రా పరిశీలించారు. అనంతరం అన్ని రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో గదులను సీజ్ చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వకు బుంగ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిన్న గంగారం గ్రామసమీపంలో పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వకు శుక్రవారం బుంగ పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వకు చిన్నగంగారం గ్రామ సమీపంలో రెండు రోజుల క్రితం లీకేజీ కావడం ప్రారంభమైంది. చిన్నగా ఏర్పడ్డ లీకేజీతో శుక్రవారం బుంగ పడింది. దీంతో ప్రాజెక్టు కాల్వ నీరు సమీపంలోని వాగులోకి వృథాగా పోతుంది. కాగా ప్రధాన కాల్వకు బంగ పడడంతో చిరుతపల్లి, బర్లగూడెం, రామవరం గ్రామాల్లోని వరి, మిర్చి పంటలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు త్వరగా స్పందించి, కాల్వకు ఏర్పడిన బుంగకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఎయిడ్స్‌ను అంతం చేయాలి



ప్రశంస పత్రాలు అందజేస్తున్న జడ్జి, అధికారులు

భూపాలపల్లి అర్బన్: ఎయిడ్స్‌ను 2030 వరకు అంతం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. మందులతో కొద్దిరోజులు బతకడం తప్ప ఎయిడ్స్‌కు పూర్తి నివారణ లేదన్నారు. నాగరిక సమాజంలో జీవిస్తున్న మనుషులుగా మనందరం కలిసి విచ్చలవిడి శృంగారాన్ని, అక్రమ సంబంధాలను రూపుమాపాలని పిలుపునిచ్చారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారి వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. వారికి కావాల్సిన మందులను అందించాలని జడ్జి వైద్యాధికారులకు సూచించారు. ఎయిడ్స్ వ్యాధిని రూపుమాపడంలో నిరంతరం సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జడ్జి అభినందించి ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమా, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, మారి స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధి సదానందం, చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బంది వెంకటస్వామి, డాక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి ఘటనలో పలువురిపై కేసు

నెక్కొండ : బీఆర్‌ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎన్నికల ఏజెంట్ పెద్ది స్వప్నపై దాడి చేసిన ఘటనలో శుక్రవారం పలువురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఎస్సై షేక్ జానీపాషా తెలిపిన వివరాలు.. మండలంలోని రెడ్లవాడ గ్రామంలో గల 262 పోలింగ్ బూత్‌ను గురువారం పెద్ది స్వప్న పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు స్వప్నను పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లకుండా అడ్డుకొని, దాడి చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వప్న ఫిర్యాదు మేరకు ఆవుల శ్రీనివాస్, దూదిమెట్ల రాజు, దూదిమెట్ల కొమురయ్య, గుండెబోయిన దేవేందర్, సుంకరబోయిన రాజశేఖర్, రావుల వేణు, బాదావత్ సూర్య, మాలోత్ వెంకన్నలపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఘర్షణ..

బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ జరిగినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఎన్నికల పోలింగ్ సరళి, తదితర విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ క్రమంలో ఓటర్లకు డబ్బుల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో పలువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకొని, ఘర్షణకు దారి తీసింది. ఈ విషయమై పార్టీ నాయకులను వివరణ కోరగా ఎలాంటి ఘర్షణ జరగలేదన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో బర్నర్ ఆపరేటర్ మృతి

గీసుకొండ : మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గణేషా కంపెనీలో బర్నర్ ఆపరేటర్ రామయస్ ప్రసాద్‌యాదవ్ (23) పని చేస్తున్నాడు. ఈ క్రమంలో దారం బెల్ అతడి నడుం మీద పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి తెలిపిన వివరాలు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం సింగారామ్ జిల్లా వడగడి తాలూకా గీధర్ గ్రామానికి చెందిన రామయస్ ప్రసాద్‌యాదవ్ గత నెల 23న తన తోటి వర్కర్లతో కలిసి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు దారం బెల్ అతడి నడుంపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతడిని హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ రామకృష్ణ తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధురాలు..



తొర్రూరు రూరల్ : లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాంజీ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారి మడూరు గ్రామానికి చెందిన గుడిగుండ్ల వెంకటమ్మ(65) గ్రామంలో కిరాణం సరుకులు తీసుకుని వెళ్తోంది.ఈ క్రమంలో తొర్రూరు నుంచి పాలకుర్తి వెళ్తున్న లారీ ఆమెను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్.. మహిళ మృతి



కాజీపేట పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు



ఫాతిమానగర్ బ్రిడ్జి వద్ద స్తంభించిన ట్రాఫిక్

- న్యాయం చేయాలని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద మృతురాలి కుటుంబీకుల ఆందోళన
- స్తంభించిన ట్రాఫిక్.. నిందితుడు ఎక్సైజ్ అధికారి కుమారుడు



గాదె కవిత (ఫైల్)

కాజీపేట : ఓ ఎక్సైజ్ అధికారి కుమారుడు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. రోడ్డు పక్కన నిల్చున్న మహిళను నేరుగా ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈఘటన గురువారం జరగగా, బంధువులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాజీపేట–ఫాతిమానగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆందోళనకు దిగారు. దీంతో దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. కాజీపేట 48వ డివిజన్ శౌరినగర్ కాలనీకి చెందిన గాదె కవిత (38) గురువారం మధ్యాహ్నం సెయింట్ గ్యాబ్రియల్ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు భర్తతో కలిసి వచ్చి రోడ్డుపక్కన నిలబడి ఉంది. ఇదే సమయంలో దర్గా కాజీపేట వైపు వెళ్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కవితను స్థానికుల సహాయంతో భర్త ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె మృతి చెందింది.

డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే కవిత మృతి..

ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కుమారుడు దొడ్ల వంశీ భార్గవ్ అతి వేగంగా కారును డ్రైవ్ చేసి ఢీకొట్టడంతో కవిత తీవ్రంగా గాయపడి మృతిచెందింది. విదేశాల్లో ఉంటూ ఇటీవలే వివాహ వేడుక నిమిత్తం వచ్చిన వంశీ అతివేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

మృతురాలి కుటుంబ సభ్యుల ఆందోళన..

నిందితుడు ఎక్సైజ్ అధికారి కుమారుడు కావడంతోనే అతడిని కాపాడాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు ఫాతిమానగర్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జితో పాటు కాజీపేట పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. వందల మంది తరలి వచ్చి రోడ్డుపై బైఠాయించడంతో బ్రిడ్జికి ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగడంతో పోలీసులు ట్రాఫిక్‌ను దర్గా కాజీపేట మీదుగా మళ్లించారు. పోలీస్ అధికారులు జోక్యం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయం చూస్తామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. మృతురాలికి ఆడపిల్లలు, భర్త ఉన్నారు.

నిందితుడిపై కేసు నమోదు..

కారును నిర్లక్ష్యంగా నడిపి మహిళ మృతికి కారణమైన వంశీ భార్గవ్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. మృతురాలి భర్త జోసఫ్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సార్ల రాజు తెలిపారు.

దర్గా రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్ జామ్



దర్గా రైల్వే గేట్ నుంచి గాంధీ సెంటర్ వరకు ట్రాఫిక్‌జామ్‌లో నిలిచిన వాహనాల

కాజీపేట రూరల్ : కాజీపేట సెయింట్ గాబ్రియల్ స్కూల్ వద్ద కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘ టనలో శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు న్యాయం చేయాలని ఫాతిమానగర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది ప డ్డారు. అన్ని వర్గాల వాహనదారులు దర్గా రైల్వే గేట్ నుంచి భట్టుపల్లి, కడిపికొండ బ్రిడ్జి మీదుగా బాపూజీనగర్ సెంటర్ మీదుగా కాజీపేటకు చేరుకున్నా రు. దీంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు ఫాతిమానగర్, దర్గా రోడ్లు, దర్గా రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొందరు పాదచారులు, విద్యార్థులు, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఫాతిమానగర్ బ్రిడ్జి కింద నుంచి రైలు పట్టాలు దాటి వెళ్లారు.

ఓటు వేసి.. మృత్యుఒడిలోకి..

- కుటుంబంలో విషాదం నింపిన ఎన్నికలు
- భార్య మృతి, భర్త, కుమారులకు తీవ్ర గాయాలు



మానస(ఫైల్)

గీసుకొండ : అసెంబ్లీ ఎన్నికలు ఆ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. స్వగ్రామంలో ఓటు వేసి తిరిగి వెళ్తుండగా మృత్యువు కారు రూపంలో వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఇద్దరు కుమారుల కాళ్లు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేటకు చెందిన వాంకుడోత్ రవీందర్ తన కుటుంబంతో కలిసి హనుమకొండ రెడ్డికాలనీలో నివాసముంటున్నారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా స్వగ్రామంలో ఓటు హక్కు వినియోగించుకుని బైక్‌పై భార్య మానస(27), ఇద్దరు కుమారులు జ్ఞాన చైతన్య, హర్షవర్ధన్‌ను తీసుకుని హనుమకొండకు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో వరంగల్–నర్సంపేట రహదారిపై గీసుకొండ మండలం కొమ్మాల శివారులోకి రాగానే నర్సంపేట వైపునకు ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్ అతి వేగంగా వచ్చి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రవీందర్, మానసకు బలమైన గాయాలు కాగా వారి కుమారుల కాళ్లు విరిగాయి. వారందరినీ 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం మానసను హనుకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం ఉదయం మృతి చెందింది. అజాగ్రత్తగా కారు నడిపిన డ్రైవర్‌పై చట్టరీత్యా చర్య తీసుకోవాలని, మృతురాలి బంధువు వాంకుడోత్ ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ రామకృష్ణ తెలిపారు.

ఆటో బోల్తా.. బాలిక..



మృతి చెందిన మీనాక్షి

బచ్చన్నపేట : మండలంలోని లింగంపల్లికి చెందిన తాడూరి పుష్ప, కిష్టయ్య హైదరాబాద్‌లోని మల్కాజిగిరిలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తమ కుమార్తె మీనాక్షి(14)తో కలిసి ఓటు వేసేందుకు స్వగ్రామమైన లింగంపల్లికి ఆటోలో వచ్చారు. ఓటేసిన అనంతరం తిరుగు ప్రయాణంలో గురువారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో కీసర వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోకు అడ్డుగా కుక్క రావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో అందరికి గాయాలయ్యాయి. కూతురు మీనాక్షికి బలమైన గాయాలు కావడంతో గమనించిన వారు అందుబాటులోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అప్పటి వరకు తమతో సంతోషంగా గడిపిన కూతురు విగతజీవిగా మారడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడికి కత్తిపోట్లు

- పరస్పరం దాడిచేసుకున్న మిత్రులు

వరంగల్ చౌరస్తా : మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఎన్నికల తాయిళాల వ్యవహారంతో శుక్రవారం రాత్రి పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో ఓ యువకుడు కత్తిపోట్లకు గురైన ఘటన వరంగల్ హంటర్ రోడ్డులో చోటు చేసుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ అండర్ రైల్వే గేట్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన శ్రీను, సందీప్ మిత్రులు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు ఓ పార్టీ అభ్యర్థికి చెందిన నగదును ఓటర్లకు శ్రీను అనే యువకుడు సందీప్ సహాయంతో పంపిణీ చేశారు. ఈ క్రమంలో శ్రీను కొంత సొమ్మును సందీప్‌కు ఇస్తానని హామీ ఇచ్చాడు. వీరిద్దరూ హంటర్ రోడ్డు చిన్న బ్రిడ్జికి సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫుల్‌గా మద్యం తాగి బయటకు వచ్చారు. ఎన్నికల డబ్బుల విషయంపై మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. శ్రీను తన వద్ద ఉన్న చిన్న కత్తితో సందీప్ ఛాతిపై, కడుపులో పొడిచాడు. దీంతో సందీప్ కత్తిపోట్లతో గాయాలు కాగా శ్రీనును కింద పడేసి చితకబాదాడు. సమాచారం మేరకు మట్టెవాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇద్దరిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సందీప్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. సందీప్ కుటుంబ సభ్యులు మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనపై పోలీసులు ఆరాతీస్తున్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని శాకరాశికుంట ప్రధాన డ్రెయినేజీ కాల్వల్లోకి శుక్రవారం రాత్రి కారు దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డుపై ఒకపక్కా చీకటి, మరోపక్క గుంతలు ఉండటంతో కారు అదుపు తప్పి ప్రధాన డ్రెయినేజీలోకి వెళ్లగా.. కారులో ప్రయాణిస్తున్న వారికి పెనుప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే అప్రమత్తమై కారులో ప్రయాణిస్తున్న వారిని క్షేమంగా బయటకు తీశారు.తర్వాత క్రేన్ సహకారంతో కాల్వలోకి దూసికెళ్లిన కారును బయటకు తీశారు.విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

మానుకోటలోని రెండిళ్లలో చోరీ

- 3 తులాల బంగారం, రూ.1.45 లక్షల నగదు అపహరణ



హనుమ ఇంట్లో దొంగలు చెల్లాచెదురు చేసిన దుస్తులు



నవీన్ కుమార్ ఇంట్లో పగులగొట్టిన బీరువా

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పులి గోపాల్‌రెడ్డినగర్ ప్రాంతంలో రెండిళ్లలో చోరీ చేసి 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.45 లక్షలు నగదు దోచుకువెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా మెడికల్ షాపు నిర్వహిస్తున్న బానోత్ హనుమ కుటుంబ సభ్యులు ఓటేసేందుకు నవంబర్ 28న తమ స్వస్థలమైన కురవి మండలం లింగ్యా తండాకు వెళ్లారు. అలాగే వారి ఇంటి పక్కనే నివాసముంటున్న ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ కోడిరెక్కల నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు సైతం నవంబర్ 29వ తేదీన ఖమ్మం జిల్లాకు వెళ్లారు. ఆ రెండిళ్ల తలుపుల తాళాలు పగులగొట్టి ఉన్నాయని స్థానికులు వారికి నవంబర్ 30వ తేదీన సమాచారమిచ్చారు. ఓట్లు వేసే పని ముగించుకుని అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని దుస్తులు, బీరువా మొత్తం చెల్లాచెదురుగా పడవేశారు. కాగా, బానోత్ హనుమ ఇంట్లో రూ.75వేలు నగదు, కోడిరెక్కల నవీన్ కుమార్ ఇంట్లో రూ.70వేల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురికాగా బాధితులు మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

కృష్ణారెడ్డి సేవలు వెలకట్టలేనివి



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న పీఠాధిపతి వెంకన్న, అధ్యాపకులు

- జానపద గిరిజన విజ్ఞాన పీఠం అధిపతి డాక్టర్ వెంకన్న

విద్యారణ్యపురి : తెలుగు రాష్ట్రాల్లో జానపద కళాకారుల అభ్యున్నతికి ఆచార్య చెగిచెర్ల కృష్ణారెడ్డి చేసిన సేవలు వెలకట్టలేనివని జానపద గిరిజన విజ్ఞాన పీఠం అధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారం అందుకున్న జానపద కళల శాఖ పూర్వ శాఖాధిపతి కృష్ణారెడ్డిని శుక్రవారం హంటర్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం సెమినార్ హాల్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకన్న మాట్లాడారు. కృష్ణారెడ్డి జానపద కళలకు ఎన్నో సేవలు అందించారన్నారు. అనంతరం సీనియర్ అధ్యాపకులు భూక్యా బాబురావు మాట్లాడుతూ.. జానపద కళల అభివృద్ధికి కృష్ణారెడ్డి చేసిన కృషి గొప్పదని అన్నారు. సన్మాన గ్రహీత కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక అవార్డు పొందటం ఆనందంగా ఉందన్నారు. అధ్యాపకులు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, చూరేపెల్లి రవికుమార్, బాసని సురేష్, అబ్బు గోపాల్ రెడ్డి, గంపసతీష్, పరవస్తు విజయలక్ష్మి, సునంద ,అశోక్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న భూగర్భ జలాలు

- జిల్లాలో 4.11 మీటర్ల లోతుల్లో నీళ్లు
- గత నెలలో 3.86 మీటర్ల అడుగున..

హన్మకొండ: భూగర్భ జలాలు ప్రతినెలా స్వల్పంగా పడిపోతున్నాయి. సెప్టెంబర్‌తో వర్షాలు పూర్తిగా తగ్గాయి. ఈఏడాది వర్షాకాలం ఆరంభంలో వర్షాభావ పరిస్థితులుండగా.. జూలై చివరి వారంలో కుండపోత వర్షంతో అతివృష్టి నెలకొంది. ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో జలాశయాలు నిండాయి. దీంతో భూగర్భ జలాలు ఒక్కసారిగా పెరిగాయి. ఆతర్వాత వర్షాలు అంతంత మాత్రమే పడడంతోపాటు వ్యవసాయ పనులు ఊపందుకోవడం, వరి సాగు విస్తీర్ణం పెరగడంతో భూగర్భ జలాల వినియోగం పెరిగింది. దీంతో సెప్టెంబర్, అక్టోబర్ మాసం నుంచి స్వల్పంగా జలాలు పడిపోతున్నాయి. రుతుపవనాల ఆరంభానికి ముందు మే నెలాఖరులో హనుమకొండ జిల్లాలో సగటు భూగర్భ జలాలు 6.11 మీటర్ల లోతుల్లో ఉన్నాయి. వరి పంట చేతికొచ్చి భూగర్భ జల వినియోగం నిలవడంతో జూన్ మాసాంతంలో 1.98 మీటర్ల ఎత్తుకు పెరిగాయి. జూలై మాసాంతానికి 2.86, ఆగస్టు మాసాంతానికి 3.01, సెప్టెంబర్ మాసాంతానికి 3.39 మీటర్లు, అక్టోబర్ మాసాంతానికి 3.86 మీటర్ల లోతుకు, నవంబర్ మాసాంతానికి 4.11 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. నవంబర్ మాసాంతానికి జిల్లాలోని భీమదేవరపల్లి జగన్నాథపూర్‌లో 11.35, వంగరలో 9.63 మీటర్లు ఐనవోలులో 10.10 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. జిల్లాలో 25 ఫీజో మీటర్లలో నమోదైన భూగర్భ జలాల వివరాల్ని భూగర్భ జల శాఖ సేకరించింది.

జిల్లాలో నవంబర్ మాసాంతానికి భూగర్భ జలాలు (మీటర్ల లోతులో)

ప్రాంతం	అక్టోబర్	నవంబర్
గట్ల నర్సింగపూర్	3.70	4.68
జగన్నాథపూర్	8.50	11.35
కొత్తపల్లి	5.20	4.90
వంగర	8.90	9.63
ధర్మాపూర్	2.70	2.60
ధర్మసాగర్	1.50	1.82
పెద్ద పెండ్యాల	4.90	5.15
నారాయణగిరి	4.6	2.57
ఎల్కతుర్తి	9.00	7.65
హనుమకొండ	4.90	4.65
నాగారం	6.10	4.05
సీతంపేట	2.20	3.40
ఎల్లాపూర్	2.10	2.35
ఐనవోలు	7.40	10.10
శనిగరం	1.10	1.73
పున్నేలు	2.30	2.80
పంథిని	1.00	1.80
పీచర	4.50	3.92
వేలేరు	1.5	1.65
ఆత్మకూరు	1.50	1.95
దామెర	1.10	1.60
చెర్లపల్లి	6.80	6.90
నడికూడ	1.30	0.90
పరకాల	2.10	2.22
శాయంపేట	1.60	2.50

కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

రేపటి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు తెలిపారు. జనగామలో శివలింగయ్య, భూపాలపల్లిలో భవేశ్ మిశ్రా, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం పరిశీలించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఈవీఎంలను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



భూపాలపల్లి అర్బన్: కౌంటింగ్ హాల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



జనగామ రూరల్: అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య



బాక్సులను తరలిస్తున్న సిబ్బంది











వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో అధికారులు ఏర్పాటు చేసిన టేబుళ్లు